క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కోడేరు: మండల కేంద్రానికి చెందిన సొప్పరి మశమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖరీం, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జగదీశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, చామంతి రాజులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పుట్ట రాము, పాండేళ్ల సురేష్, శరత్ బాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లతో కూరగాయల సాగు



పెద్దకొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల రైతులు పాలిథిన్ కవర్ల కూరగాయల సాగుపై మక్కువ చూపుతున్నారు. మండలంలోని సాతాపూర్, చెన్నపురావుపల్లి, చిన్నకార్పాముల, కల్వకోల్ గ్రామాల్లో రైతులు కూరగాయలు సాగు చేపట్టారు. పాలిథిన్ కవర్‌లను ఏర్పాటు చేసుకొని మధ్యమధ్యలో రంధ్రాలు ఏర్పాటు చేసి డ్రిప్ సౌకర్యం ద్వారా మొక్కలకు నీరు అందిస్తున్నారు. నీటి తేమశాతం ఆరిపోకుండ పాలిథిన్ కవర్ ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు. కలుపు మొక్కలు కూడ పెరగకపోవడంతో కూరగాయల దిగుబడి పెరుగుతుందని రైతులు వివరించారు. ఒక ఎకరాకు పాలిథిన్ కవర్లు రూ.4 వేల ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో పోలింగ్ కేంద్రాలు పరిశీలించి, సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు సెక్టోరియల్ అధికారి రమణరావు తెలిపారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



గట్టు: మాజీ మంత్రి డీకే సమరసింహారెడ్డి చాగదొణ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జంగం శివయ్యతో పాటుగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం జంగం శివయ్య కుమారుడు కుమారస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ముళ్లపొదల్లో కేఎస్పీ కాల్వలు



మరికల్: కోయిల్‌సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించే కాల్వలు ముళ్లపొదల్లో అల్లుకుపోయాయి. ప్రస్తుతం యాసంగిలో ప్రాజెక్ట్ నుంచి సాగునీరు విడుదల చేస్తే నీరు ముందుకు రాని విధంగా ముళ్లచెట్లు ఉన్నాయి. తీలేర్ పంపుహౌస్ నుంచి వచ్చిన డిస్ట్రిబ్యూటర్ 16 కాల్వతోపాటు పిల్ల కాల్వల పరిస్థితి కూడా ముళ్లపొదలతో మూసుకుపోయాయి. పంపుహౌస్ నుంచి కన్మనూర్ వరకు 20కిలో మీటర్ల పొడవు ఉన్న ఈ కాల్వలో ముళ్లచెట్లతోపాటు పిచ్చిమొక్కలు భారీగా పెరగడంతో వానాకాలంలో నీళ్ల రాని పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టు అధికారులు స్పందించి ముళ్లచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమించొద్దు

నర్వ: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ కురుమయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం సాయంత్రం నుంచి డిసెంబర్ 1 ఉదయం 6గంటల వరకు 144 సెక్షన్ అములులో ఉన్నాయన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. పోలీంగ్ కేంద్రాల చుట్టు పక్కల 200 మీటర్ల వరకు 30న రాత్రి 8 గంటలవరకు సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఐదుగురు అంతకన్నా ఎక్కువ మంది గుమికూడవద్దని, ఎన్నికల ప్రచారం గడువు ముగిసిందని ఎటువంటి ర్యాలీలు, సభలు, పోస్ల ద్వారా సోషల్‌మీడియాలలో ప్రచారాలు చేయొద్దని ఆయన తెలిపారు.



కొత్తకోట పోలింగ్ కేంద్రం వద్ద..



ఆరేపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు



పుల్గరచర్లలో..

అసెంబ్లీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

పాన్‌గల్: గురువారం నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తి చేసినట్లు పోలింగ్ అధికారి రాంబాయి బుధవారం తెలిపారు. మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో మొత్తం 40,876 మంది ఓటర్లు కాగా వారిలో 20,499 మంది పురుషులు, 20,376 మంది స్త్రీలు, ఇతరులు ఒక్కరు ఉన్నారు. మండలంలో 43 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. 12 కేంద్రాలకు ఒక్కరు చొప్పున ఐదుగురు సెక్టోరియల్ అధికారులు కలిపి మొత్తం 215 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఎన్నికల విధుల అనంతరం ఈవీఎం బాక్సులను చేరవేసేందుకు ఐదు రూట్లను ఏర్పాటు చేశామని ఉన్నతాధికారులు తెలిపారు.



పాన్‌గల్‌లో భద్రతపై సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్‌ఐ వేణు

పోలీసు సిబ్బంది

మండలంలో ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు పోలీసు సిబ్బందిని నియమించారు. ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఎస్‌ఐతో పాటు మొత్తం 120 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ వేణు పేర్కొన్నారు. పోలింగ్ జరిగే అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికలు పూర్తి అయ్యే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మండలంలో ఐదు రూట్లను ఏర్పాటు చేశామని ఆయా రూట్లలో సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సిబ్బందితో పాటు ఒక మొబైల్ టీం పర్యవేక్షణ చేస్తుందన్నారు.

కొత్తకోట రూరల్: గురువారం నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో దేవరకద్ర నియోజవర్గం పరిధిలోని కొత్తకోట మండల కేంద్రంతో, వివిధ గ్రామాల్లో మొత్తం 51,352మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 25,556 మంది పురుషులు, 25,796 మంది మహిళలు తమ ఓటు హక్కును వినయోగించుకోనున్నారు. దివ్యాంగులు తమ ఓటు వినియోగంచుకునేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలో 20పోలింగ్ కేంద్రాలు, మండలంలోగల 22 గ్రామాల్లో 40పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఎన్నికల విధుల్లో 480మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఒక డీఎస్పీ, ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, పారామిలటరీ పోలీసులతో పాటు 135మంది పోలీసు సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గుంపులు, గుంపులుగా ఉండకూడదన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు.

28 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

వీపనగండ్ల: మండలంలో 14 గ్రామ పంచాయతీలకు గాను మొత్తం 28 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. 22,573 మంది ఓటర్లు ఉండగా.. వారిలో పురుష ఓటర్లు 11,563 మంది, మహిళలు 11,190 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు ఆమె తెలిపారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని ఆమె కోరారు. పోలింగ్ స్టేషన్‌లో పాల్గొనేందుకు వచ్చిన సిబ్బందికి అన్ని రకాల వసతులను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. శాంతి పరిరక్షణలో భాగంగా స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలతో పోలింగ్ స్టేషన్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ రవిప్రకాశ్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట బద్రత

ఆత్మకూర్: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని తహసీల్దార్ రాజు, ఎస్‌ఐ నరేందర్, ఎంపీడీఓ నాగేందర్ కోరారు. బుధవారం పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. మండలంలో 35 పోలింగ్ కేంద్రాల్లో ఆరుగురు సెక్టోరియల్ అధికారులు, బూత్‌కు ఐదుగురు పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారని తెలిపారు. ఆత్మకూర్, రేచింతల, ఆరేపల్లి, పిన్నంచర్ల గ్రామాల్లోని 15 పోలింగ్‌కేంద్రాలు సమస్యాత్మకంగా గుర్తించామని, అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయడంతో పాటు సౌకర్యాలను సమకూర్చారు. రాజకీయ పార్టీలకు చెందినవారు సమస్యలను సృష్టించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



చిక్కేపల్లి పోలింగ్ బూత్‌లోకి ఈవీఎంలతో వెళ్తున్న సిబ్బంది



కొత్తపేట పోలింగ్ కేంద్రం వద్ద..



చిట్యాల శివారులోని స్ట్రాంగ్ రూం నుంచి పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న అధికారులు



వనపర్తిలో..

తప్పుల జాబితాలను సవరించాలి

పాన్‌గల్: అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితాలో తప్పుల తడకను వచ్చే ఎన్నికలకైనా సవరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కేతేపల్లిలో వారు మాట్లాడుతూ జిల్లాలోని చాలా గ్రామాల్లో చనిపోయిన వారి పేర్లు, వివాహం జరిగి అత్తగారింటి వెళ్లిపోయిన ఆడ పిల్లల పేర్లు తొలగించలేదన్నారు. మరికొందరివి రెండు నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్నాయన్నారు. ఈ విధంగా ఉండటం వలన దొంగ ఓట్లు పోలయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరికొందరు నూతనంగా దరఖాస్తు చేసుకున్నా.. వారి పేర్లు జాబితాలో నమోదు కాలేదని విమర్శించారు. ఓటర్ జాబితా అసమగ్రంగా, గందరగోళంగా ఉన్నాయన్నారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఓటరు జాబితా తప్పుల తడకగా ఉందన్నారు. ఈ తప్పులను వచ్చే పార్లమెంటు, స్థానిక ఎన్నికల వరకైనా సరిదిద్దాలని కోరారు. సమావేశంలో పెద్ద హన్మంతు, లక్ష్మీనారాయణ, కాకం చిన్నరాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీరామ్

ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తప్పవు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, కోదండాపురం పీఎస్‌ల పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోబాలకు గురిచేస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐలు అశోక్‌బాబు, కృష్ణదేవా బుధవారం తెలిపారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, వారితో ఒట్టు వేయించినా, వాహనాల ద్వారా రవాణా చేసినా అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వచ్చే నెల 4వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఐదు మంది ఒకేచోట నిలబడి ఉండటం నిషేధమన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేయడానికి ఎలాంటి కార్యక్రమాలను చేపట్టినా లేదా ఎన్నికల ప్రవర్తన నియమావళిని దుర్వినియోగం చేసినా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాజీ వైస్ ఎంపీపీపై దాడి హేయమైన చర్య

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని హనుమాన్ నగర్‌లో కల్వకుర్తి మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు బొమ్ము ఆంజనేయులుపై మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం దాడి చేయడాన్ని ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు ఖండించారు. బుధవారం కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులతో కలిసి బాధితుడు ఆంజనేయులు మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ అకారణంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ తనపై దాడి చేశాడని బాధితుడి ఆరోపించారు. మాజీ వైస్ ఎంపీపీపై దాడిని నిరసిస్తూ బుధవారం కల్వకుర్తి పట్టణంలో ఆర్యవైశ్యులు వ్యాపార వాణిజ్య సముదాయాలను మూడు గంటలపాటు మూసి వేసి నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో కౌన్సిలర్ సతీష్, శివాలయం శ్రీనివాస్, వజ్రలింగం, శేఖర్, శ్రీనివాస్, సిమ్మయ్య, రఘు, తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ దాడిని ఓ ప్రకటనలో ఖండించారు.

నాయకులు కనబడుట లేదు

- ఓటర్లను ప్రసన్న చేసుకునే ప్రయత్నంలో నిమగ్నం!

నవాబుపేట: దాదాపుగా నెల రోజులకుపైగా జనం మధ్య బహిరంగంగా కనిపిస్తూ ప్రచారాలు నిర్వహించిన వివిధ పార్టీల నాయక గణం తాజాగా అదృశ్యమైంది. ఉన్నట్టుండి మాయమైన వీరంతా.. గుట్టుచప్పుడు కాకుండా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. దీంతో గ్రామాల్లో నిశబ్ద వాతావరణం కనిపిస్తోంది. ప్రధానంగా కుల సంఘాల నాయకులకు, మహిళ సంఘాలకు వివిధ పార్టీల నాయకులు తాయిలాలు ప్రకటిస్తున్నట్లు, నగదు, మద్యం తదితరాలు పంపిణీ చేస్తూ తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారని సమాచారం. మండలంలో చాప కింద నీరులా సాగుతున్న ఈ ప్రక్రియ సాగుతోంది. మండలంలో ముదిరాజ్, యాదవ, గౌడ, ఎస్సీ, ఎస్టీ ఓటర్లు ఎక్కువగా ఉండటంతో వారిపైనే నాయకులంతా దృష్టిపెట్టి మంతనాలు చేస్తున్నట్లు వినవస్తోంది.

మరమ్మతు చేయాలి

మరికల్: మండలంలోని పలు గ్రామాల స్టేజీల వద్ద ఉన్న గ్రామీణ బస్టాండ్లను సంబంధిత అధికారులు మరమ్మతులు చేసేందుకు ముందుకు రావాలని కార్మిక సంఘం నాయకులు రాములు, వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. గ్రామాల స్టేజీల వద్ద బస్టాండ్లను పట్టించుకోకపోవడంతో ముళ్లపొదాలు అలుముకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే వేసని దృష్టిలో ఉంచుకొని బస్టాండ్లను మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్లపైనే విక్రయాలు!



కోడేరులో రోడ్డుపై జరుగుతున్న సంత

కోడేరు: మండల కేంద్రంలో నిర్వహించే సంతలో ఉన్న సమస్యలు తిష్ట వేశాయి. అన్నదాతల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల వ్యాపారులకు వసతులు కల్పించడం లేదు. దీంతో సంతలో సమస్యలు తాండవిస్తున్నాయి. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం వారాంతపు సంత నిర్వహిస్తున్నారు. కూరగాయల విక్రయించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలం నుంచి పస్పుల, కదిరెపాడు, సింగాయిపల్లి, రేవల్లి, తదితర గ్రామాల నుంచి రైతులు పండించిన కూరగాయలను సంతలో విక్రయిస్తుంటారు. కనీసం కూర్చోవడానికి కూడా స్థలం లేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఎండ, వానలోనే రైతులు కూరగాయలు విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్లపైనే కూర్చొని కూరగాయలు అమ్ముతుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వినియోగదారులకు పార్కింగ్ స్థలంలేక రాకపోకలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

బస్సుల రాకపోకలకు అడ్డంకులు

మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తుండటంతో బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికితోడు రోడ్లపైనే రైతులు, వినియోగదారుల వాహనాల పార్కింగ్ చేయడంతో బస్సులు కొంత దూరంలోనే నిలపాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ఆర్టీసీ ప్రయాణికులు గ్రామాలకు వెళ్లేందుకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సంతను మరొక చోటకు మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కనీస వసతులు కరువు

ప్రతి వ్యాపారి దగ్గర నుంచి పంచాయతీ అధికారులు తైబార్ వసూలు చేస్తున్నారు. కాని వారికి కనీసవసతులు కల్పించడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారు. షెడ్లు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేక నరకయాతన అనుభవిస్తున్నారు. వ్యాపారులతో పాటు కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలో కూరగాయలు విక్రయించడంతో కూరగాయలు వాడిపోతున్నాయి. కూరగాయల మార్కెట్ కోసం ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

సంతను మరోచోటికి మార్చాలి

స్థానిక బస్టాండ్‌లో రోడ్డుకు ఇరువైపులా సంతను కొనసాగించడం వల్ల వాహనాలు, ఎద్దుల బండ్లు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రోడ్లపై వెళ్లే వారికి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంతను మరొక చోటకు మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–మిద్దె రామకృష్ణ, కోడేరు

కనీస సదుపాయాలు కల్పించాలి

కూరగాయల సంతలో వ్యాపారులు, కొనుగోలు దారులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వసతులు లేవు. అత్యవసర పరిస్థితిలో ఎక్కడికెళ్లాలో తెలియడం లేదు. గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకొని కూరగాయల సంతలో కనీస వసతులు ఏర్పాటు చేయాలి.

–నిర్మల, కోడేరు

ప్రభుత్వ స్థలంలోకి మారుస్తాం



గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలం ఉంటే సంతను మరొక చోటకు మార్చేందుకు చర్యలు తీసుకుంటాం. బస్టాండ్‌లో సంత నిర్వహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. వినియోగదారుల, రైతుల సౌకర్యార్థం వేరేచోటికి మారుస్తాం.

– బాలచందర్‌సృజన, ఎంపీడీఓ

వరిగడ్డిలో మెండుగా పోషకాలు

- పంటల వ్యర్థాలను కాల్చొద్దు
- పశుగ్రాసంగా వినియోగించుకుంటే ఉత్తమం

మాగనూర్: వానాకాలం వేసుకున్న వరిపంట దిగుబడి వచ్చింది. వరికోతల అనంతరం గడ్డిని పాడి పశువుల పోషణకు గ్రాసంగా ఏడాది వరకు నిల్వ చేసుకునే వీలుంది. పాడిపశువులకు సాధారణంగా వరిగడ్డిని పశుగ్రాసంగా అందించడం మనకు తెలిసిందే. కొంతమంది రైతులు ఇటీవల కాలంలో యంత్రాల ద్వారా వరి కోతలు గడ్డిని పొలాల్లోనే వదిలేస్తున్నారు. అనంతరం పంటల కోసం కాల్చివేస్తున్నారు. ఈ వరిగడ్డిలోంచి 40 నుంచి 50 శాతం మాత్రమే శక్తిగా మార్చి పశువు జీవక్రియలకు ఉపయోగపడుతుంది. వరిగడ్డి నిల్వ, వాటిలో లభించే ప్రొటీన్‌ల ఆవశ్యకతను మాగనూర్ పశువైద్యశాఖ జూనియర్ అసిస్టెంట్ వినయ్‌కుమార్ వివరించారు.

తయారీ విధానం..

పశుగ్రాసాలకు ఎంచుకున్న వరిగడ్డిలో పోషకాల స్థాయిని పెంచేందుకు యూరియా మంచి ఫలితాలిస్తుంది. ఈ విధంగా 100 కిలోల వరిగడ్డికి 4 కిలోల యూరియా నీటితో తడిపి ఇరవై రోజుల మాగాక వాడుకోవచ్చు.

- ముందుగా తయారీకి ఎంచుకున్న ప్రదేశాన్ని బాగా శుభ్రం చేసి పాలిథిన్ సంచులను కానీ పట్టాని కానీ పరువాలి. 60 లీటర్ల నీటిలో 4 కిలోల యూరియా కలిపి, కర్రతో పూర్తిగా కరిగేలా కలపాలి. శుభ్రపరిచిన వరిగడ్డి 1/4 వంతు గడ్డిని పరిచిన పాలిథిన్ సంచిపై పరిచి, తయారు చేసిన యూరియా నీళ్లను పూర్తిగా తడిసేలా చల్లాలి. మరల ఒక పొర వరిగడ్డి పరిచి, మళ్లీ యూరియా నీళ్ల చల్లాలి.
- పొరల వారిగా వరిగడ్డి పరుస్తూ యూరియా నీరు పూర్తిగా గడ్డి తడిసేలా చల్లుతూ సమారు 20 రోజులు గాలి తగలకుండా, మాగబెట్టి తర్వాత జాగ్రత్తగా తెరిచి.. కొంచెం కొంచెం ఈ మాగుడు గడ్డిని, మామూలు పశుగ్రాసాలతో కలిపి పాడి పశువులను మేపడానికి అలవాటు చేయాలి.
- బూజుపట్టిన లేదా తెగులు సోకిన వరిగడ్డిని ఉపయోగించరాదు. మాగిన గడ్డికి 15 నిమిషాలు గాలి తగలనిచ్చిన తర్వాతే మేపాలి. యూరియా కలిపిన నీరు మిగిలితే దూడలు తాగకుండా పారబోయాలి.
- యూరియాతో మాగిన గడ్డిలో 6 శాతం మాంసకృతులు ఉండి, పశువు శరీర బరువు పెరుగుదల 2.2 శాతం పెంచగలిగి జీర్ణమయ్యే పరిమాణం 56 శాతం చూపుతుంది. మాగిన గడ్డి తియ్యగా, రుచికరంగా ఉంటుంది. కాబట్టి పశువులు ఇష్టంగా తింటాయి. ఎక్కువ భాగం జీర్ణం కాగలదు కాబట్టి పశువుల్లో జీవక్రియ సైతం సాఫీగా ఉంటుంది.



వరి గడ్డి తీసుకువెళ్తున్న రైతులు (ఫైల్)

సూచనలు పాటించాలి..



రైతులు, పశుకాపరులు పైన సూచించబడిన సలహాలు, సూచనలు పాటించాలి. దీనివలన వారికి ఇబ్బందులు ఉండవు. పశువులు కూడా ఆరోగ్యంగా ఉంటాయి.

– వినయ్‌కుమార్, మండల పశువైద్యశాఖ జూనియర్ అసిస్టెంట్